క్లుప్తంగా

అభివృద్ధి పథంలో రాష్ట్రం



కేక్ కట్‌చేస్తున్న మునిసిపల్ చైర్మన్ రాజేష్

డోన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. విశాఖ గ్లోబెల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతమైన నేపథ్యంలో సోమవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో వైఎస్ఆర్‌సిపి నాయకులు కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నంద్యాల జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, నాయకులు ఆర్‌ఈ రాజవర్ధన్, కురుకుందు హరి, రఫీ, ధారా హరి, భాస్కర్, కటికె వేణు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



మ్యూజికల్ చైర్ పోటీలో మహిళా ఉద్యోగులు

డోన్ టౌన్: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం సచివాలయ మహిళా ఉద్యోగులకు కబడ్డీ, మ్యూజికల్స్ చైర్స్, పరుగుపందెం పోటీలు నిర్వహించారు. స్థానిక డాక్టర్ రామసుబ్బయ్య పార్క్‌లో విజేతలకు కమిషనర్ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

బీమాతో బాధిత కుటుంబాలకు ధీమా



చెక్కును అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

ప్యాపిలి: ప్రమాదాల్లో కుటుంబ పెద్దను కోల్పోయిన బాధిత కుటుంబాలకు వైఎస్సార్ బీమా ధీమా కల్పిస్తుందని సర్పంచ్ కరణమం మదన్‌మోహన్ రాయల్ అన్నారు. మండల పరిధిలోని ఏనుగుమర్రి గ్రామానికి చెందిన మద్దిలేటి కొద్ది నెలల క్రితం ఏనుగుమర్రి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం వైఎస్సార్ బీమా కింద రూ. 5 లక్షలు మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని మృతుడి భార్య ప్రమీలమ్మకు సోమవారం చెక్ రూపంలో సర్పంచ్ అందజేశారు. కార్యక్రమంలో పీఎస్ పార్వతమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసులు, అరిగెల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


ఉమామహేశ్వరస్వామికి పల్లకీ సేవ



ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం యాగంటిలో ఉమామహేశ్వరస్వామికి మంగళవారం పల్లకీ సేవ నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ముందుగా శివపార్వతులకు అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు.

పాడిరైతులకు బోనస్ పంపిణీ



పాడి రైతులకు బోనస్ పంపిణీ చేస్తున్న మేనేజర్

బనగానపల్లె: విజయడెయిరీ బనగానపల్లె యూనిట్ పరిధిలోని రామతీర్థం,కందికాయపల్లె గ్రామాల్లోని 111 మంది పాడి రైతులకు ఆ సంస్థ మేనేజర్ మధుసూదన్‌బాబు సోమవారం బోనస్ పంపిణీ చేశారు. లీటర్ రూ. 2 ప్రకారం మొత్తం రూ.1,92,060లు అందజేశారు.

అధికలోడుతో వెళితే కఠిన చర్యలు

బేతంచెర్ల: నిబంధనలకు విరుద్ధంగా అధికలోడుతో వెళితే కఠిన చర్యలు తప్పవని డోన్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ వాహనదారులను హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని పలు కూడళ్లలో ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో రికార్డులు సరిగాలేని, అధికలోడుతో వెళ్తున్న వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేశారు. అలాగే వినియోగదారుల ఫిర్యాదు మేరకు బజాజ్ షోరుమ్‌ను తనిఖీ చేసినట్లు తెలిపారు.

ప్రారంభానికి సిద్ధం!

డోన్ అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే అన్ని ప్రధాన రహదారులతో పాటు గ్రామాలకు లింకు రోడ్లను ఏర్పాటు చేశారు. రూ.30 కోట్లతో వంద పడకల ప్రభుత్వాసుపత్రి, మరో రూ. 30 కోట్లతో ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాలు , నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో పాటు ఊరూరా విలేజ్ క్లినిక్‌లు, కోర్టు రోడ్డులో రూ.3 కోట్లతో ఆర్‌అండ్‌బీ వసతిగృహం, రైల్వే స్టేషన్ రోడ్డులో రూ.8 కోట్లతో మునిసిపల్ పరిపాలనా భవనం నిర్మించారు. ఇందులో కొన్ని పనులు పూర్తి కావడంతో ప్రారంభానికి సిద్ధమయ్యాయి. –డోన్



డోన్ పట్టణంలో ప్రారంభానికి సిద్ధమైన మునిసిపల్ పరిపాలన భవనం



ముస్తాబైన ఆర్‌అండ్‌బీ వసతి గృహం



యు. కొత్తపల్లెలో విలేజ్ క్లినిక్ భవనం

ఐటీఐలో స్వల్పకాలిక కోర్సులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో స్వల్పకాలిక ఉపాధి కల్పన కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.రవీంద్రబాబు సోమవారం తెలిపారు. టైలరింగ్, గృహోపకరణాలను మరమ్మతులు చేసే ఫీల్డ్ టెక్నీషియన్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. అభ్యర్థులు 8వ తరగతి వరకు చదువుకుని, చదువుమానేసిన, ఇతర విద్యార్హతలు కలిగి ఉన్న 15 నుంచి 45 ఏళ్ల వయసున్నవారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా శ్రీశైలం ఐటీఐలో సమర్పించాలన్నారు. వివరాలకు సెల్ 9440849850, 9705683537, 9440748448, 7382638904 , 9908993910 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి నీటి ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం 1,120 క్యూసెక్కుల నీరు రాగా కేసీ కాల్వకు 935 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాంలో ప్రస్తుతం 0.751 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

కోవెలకుంట్ల: వైఎస్సార్‌సీపీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం సంజామల మండలంలోని కానాల, గిద్దలూరు, ముక్కమల్ల, సంజామల గ్రామాల్లో మల్కిరెడ్డితోపాటు పార్టీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి పోచా శీలారెడ్డి, అదనపు కార్యదర్శి గుండం సూర్యప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

డోన్ రూరల్ : ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి చిన్నమల్కాపురం గ్రామంలో ఓటర్లను అభ్యర్థించారు.

కొలిమిగుండ్ల: వైఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి పేరం సత్యనారాయణరెడ్డి మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ప్యాపిలి: జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వర్ రెడ్డి ప్యాపిలి పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

అవుకు: వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా అవుకు సొసైటీ అధ్యక్షుడు చల్లా విజయభాస్కర్ రెడ్డి పట్టణంలో ప్రచారం చేశారు. అవుకు మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ చల్లా రఘునాథ్ రెడి పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీఆర్ వెంకటేశ్వరరెడ్డి సోమవారం మండలంలోని నందవరంలో వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

బేతంచెర్ల: వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజారీతో గెలిపించాలని ముద్దవరం, గోరుమానుకొండ, యంబాయి, మండ్లవానిపల్లె, ముసలాయిచెర్వు, రుద్రవరం, మర్రికుంట గ్రామాల్లో వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురళీ కృష్ణ, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

పల్లకీలో ఊరేగిన మహానందీశ్వరుడు

మహానంది: శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లు సోమవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర అవధాని, అర్చకులు శరభయ్య శర్మలు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. గోమాతను పట్టువస్త్రాలతో అలంకరించి ఆలయ ప్రాకారంలో వైభవంగా ఉత్సవం చేపట్టారు.



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

భ్రమరాంబకు ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీభ్రమరాంబాదేవికి ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా సోమవారం ఊయలసేవను అర్చకులు వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం 7 గంటల తరువాత ప్రారంభమైన ఊయల సేవ లో భాగంగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్ల మూర్తులను వేంచేయింపజేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామ పూజలు చేశారు.

పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవ మూర్తులకు సోమవారం శుద్ధ పౌర్ణమి సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులుగా వించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూ జలుచేసి,మేళతాళాలతోఆలయ ప్రదక్షిణ చేశారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన

కొలిమిగుండ్ల: బందార్లపల్లె క్రాస్ రోడ్డులోని రాయల్టీ సమీపంలోని జిల్లా సరిహద్దులో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించినట్లు మాలమహానాడు నాయకులు శింగారం సుబ్బరాయుడు సోమవారం తెలిపారు. అనంతపురం -నంద్యాల జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలంలో విగ్రహం ఏర్పాటు చేయాలని కమిటీ నిర్ణయించిందన్నారు.

డీటీహెచ్ ఇన్‌స్టాలేషన్ శిక్షణ

అవుకు: అవుకు మండల కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో డీటీహెచ్ ఇన్‌స్టాలేషన్‌పై శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం ద్వారా అందిస్తున్న ఈ శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోర్సుపై ఆసక్తిగల వారు స్థానిక ఐటీఐ కాలేజీలో సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపాల్ సూచించారు.

ప్రణాళికతో ఫలితం ‘పది’లం

- పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ చర్యలు
- ప్రత్యేక ప్రణాళికతో నైట్ విజన్ తదితర కార్యక్రమాలు
- సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



నైట్ విజన్‌లో భాగంగా విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ (ఫైల్)

కర్నూలు సిటీ: పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ ముందస్తు చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. అధికారులు ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. నైట్ విజన్ కార్యక్రమం పేరుతో పిల్లల్లో ఆత్మస్థైర్యం నింపుతున్నారు. పిల్లల చదువు పట్ల తల్లిదండ్రుల్లో కూడా బాధ్యత పెంచుతున్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న సబ్జెక్టు టీచర్లతోపాటు జిల్లాలో వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న సబ్జెక్టు నిపుణుల చేత ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. అదేవిధంగా ఫార్మేటివ్ అసెస్‌మెంట్(ఎఫ్‌ఏ) పరీక్షల నుంచి రీవిజన్ టెస్ట్‌లలో వచ్చిన ఫలితాలను బట్టి చూస్తుంటే ఈ సారి వందశాతం ఉత్తీర్ణత వచ్చేలా స్పష్టంగా కనబడుతుంది. ఈ నెల 7వ తేదీతో నాల్గవ రీవిజన్ టెస్ట్ పూర్తి అవుతుంది. ఈ నెల 9 నుంచి 20వ తేదీ వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది గతంలో కంటే భిన్నంగా జనవరి నాటికి దాదాపు అన్ని సబ్జెక్టుల సిలబస్ పూర్తి చేశారు.

పరీక్షలకు 9,526 మంది :

నైట్ విజన్ కార్యక్రమం పేరుతో విద్యాశాఖ అధికారులు రాత్రి వేళల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్తున్నారు. పిల్లల సామర్థ్యాలపై తల్లిదండ్రులతో చర్చించి వారు చదువుకునేలా వాతావరణం కల్పిస్తున్నారు. అదేవిధంగా విద్యార్థులకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్ష నిర్వహించిన తరువాత అందులో వచ్చిన ఫలితాల ఆధారంగా అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసి ఏ,డీ,సీ,డీ గ్రేడ్‌లుగా విభజించారు. సీ,డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఫార్మేటివ్-2 పరీక్షల నాటికి వారి అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ఆయా హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులతోపాటు ఏ రోజుకు ఆ రోజు స్లిప్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు. స్లిప్ టెస్ట్‌లలో వచ్చిన ఫలితాల ఆధారంగా మార్కులు తక్కువ వచ్చిన పిల్లలకు ప్రత్యేకంగా పునరుశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ చేపట్టిన చర్యలు ఫలితాలు ఇస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు 22,791 మంది ఉన్నారు. ఇందులో కర్నూలు జిల్లాకు చెందిన విద్యార్థులు 9,526 మంది పరీక్షలు రాయనున్నారు.

పిల్లల్లో ఆత్మస్థైర్యం పెంచేలా చర్యలు

పది పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు వేశాం. కలెక్టర్ ఆదేశాల మేరకు రెగ్యులర్ పర్యవేక్షణతో పాటు, రాత్రి వేళల్లో పిల్లల ఇళ్లకు వెళ్లి వారిలో ఆత్మస్థైర్యం పెంచేలా తీసుకుంటున్న చర్యలు ఫలితాలు ఇస్తున్నాయి. ఎఫ్‌ఏ-1, ఎఫ్‌ఏ-2, రీవిజన్ టెస్ట్‌ల ఫలితాలను బట్టి చూస్తే ఉత్తీర్ణత శాతం అంచనాలకు తగ్గట్లు వస్తున్నాయి.

– డా.వెంకట రంగారెడ్డి, డీఈఓ.

దరఖాస్తుల ఆహ్వానం

డోన్ టౌన్: పట్టణంలోని బి.పి. శేషారెడ్డి నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులో మూడు నెలల శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కో ఆర్డినేటర్ నాగవిఘ్నేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్స్, బీటెక్ చదివి 21 నుంచి 28 సంవత్సరాల వయస్సు ఉన్న వారు అర్హులన్నారు. వివరాలకు సెల్: 79812 38237 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మున్సిపల్ స్థలాలను పరిరక్షించాలి

డోన్ టౌన్: పట్టణంలో మున్సిపల్ స్థలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ కోరారు. స్థానిక కళ్యాణి ఎస్టేట్‌లో ఆక్రమణకు గురైన మునిసిపల్ స్థలాల వద్ద సోమవారం ఆ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లను కలిసి వినతి పత్రం అందజేశారు.

క్రీడల్లోనూ రాణించాలి

బేతంచెర్ల: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ షమీల అన్నారు. వెల్దుర్తి మండలంలో రెండు రోజుల క్రితం నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే పోటీల్లో బేతంచెర్ల మోడల్ స్కూలు విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ నేపథ్యంలో ఆ విద్యార్థులను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

ధర్మరక్షా నిధికి విరాళం

బనగానపల్లెరూరల్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలోని ధర్మరక్షా నిధికి ప్రతి ఒక్కరూ తమ వంతుగా విరాళాలు అందించాలని అందించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విరాళం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ధర్మరక్షా ప్రఖండ కార్యదర్శి ఓబులరెడ్డి, అధ్యక్షుడు వి. రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

డోన్ టౌన్: పట్టణ శివారులోని గుడారాల్లో నివసిస్తున్న మూడు నిరుపేద కుటుంబాలకు పట్టణానికి చెందిన టీచర్ జయ నిర్మల, ఏపీ పీఎస్సీ డిప్యూటీ కార్యదర్శి కేజియా ప్రసూన నిత్యావసర సరుకులు అందజేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన





సంజామల, కొలిమిగుండ్లలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రమైన సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సోమవారం తహసీల్దార్ మల్లికార్జునరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు, కడప, అనంతపురం పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల భర్తీకి ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఇందుకు గాను సంజామలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ కృష్ణయ్య, వీఆర్‌ఓ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొలిమిగుండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలను సోమవారం తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్, ఎంపీడీఓ సుబ్బరాజు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సరఫరా, టాయిలెట్లు ఇతర సౌకర్యాల గురించి హెచ్‌ఎం సోమశేఖర్‌తో చర్చించారు. మండలంలో పట్టభద్రులు 1021 మంది ఓటర్లు, ఉపాధ్యాయులు 66 మంది ఉన్నారని తెలిపారు.

తర్తూరులో అంతర్ రాష్ట్ర బండలాగుడు పోటీలు

- వివిధ కేటగిరీల్లో రూ.8.30 లక్షలతో బహుమతులు

జూపాడుబంగ్లా: ఏప్రిల్ 6 నుంచి మూడు రోజులపాటు తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని జాతరలో రూ.8.30లక్షల బహుమతులతో అంతర్ రాష్ట్ర ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, తర్తూరు దేవాలయ చైర్మన్ ప్రతాపరెడ్డి, జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం 80బన్నూరు గ్రామంలోని తర్తూరు ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి ఇంట్లో ఎద్దుల బండలాగుడు పోటీల నిర్వహణపై వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో ఏప్రిల్ 6న అంతర్ రాష్ట్ర సీనియర్స్ విభాగంలో ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు 8 బహుమతులుగా రూ.3.90లక్షల నగదును అందజేస్తామన్నారు. 7న నిర్వహించే అంతర్ రాష్ట్ర న్యూ కేటగిరీ విభాగంలో 8 బహుమతులకు రూ.2.95లక్షలు, 8న నిర్వహించే పాలపండ్ల ఎద్దుల పోటీల్లో 7 బహుమతులుగా రూ.1.45 లక్షల నగదును విజేతలైన ఎద్దుల యజమానులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, సర్పంచులు నాగార్జునరెడ్డి, పీఎం నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సూదిరెడ్డి రమేష్‌రెడ్డి, కోసిక తిరుమలేశ్వరరెడ్డి, కోసిక తరుణ్‌కుమార్‌రెడ్డి, అమరేశ్వరరెడ్డి, నరసింహయాదవ్, విశ్వనాథరెడ్డి, మద్దిలేటి రెడ్డి(నానిరెడ్డి), మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ శివరామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు కర్నూలు క్రీడాకారిణి

కర్నూలు(టౌన్): ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రం ఎక్తా నగరంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు కర్నూలు నగరానికి చెందిన సాయి గీతిక ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో ఆ క్రీడాకారిణిని సోమవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలోని తన చాంబర్‌లో సెట్‌కూ సీఈఓ రమణ, వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ శాలువాతో ఘనంగా సత్కరించారు. రూ.5 వేలు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగరత్నమయ్య మాట్లాడుతూ..ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి మార్చి 2వ తేదీ వరకు శాలి వాహన డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో సాయిగీతిక ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కోచ్ వంశీకృష్ణ, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.



సాయిగీతికను సన్మానిస్తున్న దృశ్యం

ఇక శరవేగంగా రాష్ట్రాభివృద్ధి

- సీఎం కృషితో ఏపీకి భారీగా పెట్టుబడులు
- విశాఖ సమ్మిట్ విజయవంతంపై ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి
- స్వగృహంలో కేక్ కట్ చేసి సంబరాలు



వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌తో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రానున్నాయని, దీంతో ఏపీ శరవేగంగా అభివృద్ధి చెందనుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. విశాఖ సమ్మిట్ విజయవంతంపై సోమవారం ఆయన హర్షం వ్యక్తం చేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి స్వగృహంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీగా పెట్టుబడులను ఆకర్షించి ఏపీకి గుర్తింపు తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కిందన్నారు. రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు రావడమే కాకుండా రాష్ట్రంలో 6 లక్షలమందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయన్నారు. ఇదంతా సీఎం వైఎస్ జగన్ కృషితోనే సాధ్యమైందన్నారు. ఇప్పటికే దేశం ఏపీ వైపు చూసేలా ఆయన పాలన సాగిస్తున్నారని చెప్పారు. దిగ్గజ పారిశ్రామికవేత్తలు సీఎం వైఎస్ జగన్‌ను మెచ్చుకోవడమే అందుకు నిదర్శనమన్నారు. విశాఖ సమ్మిట్ పెద్ద స్థాయిలో విజయవంతం కావడంతో ప్రతిపక్షపార్టీలు, ఎల్లోమీడియాకు దిక్కుతోచడం లేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కాటసాని ఓబులరెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు గుండంనాగేశ్వరరెడ్డి, లాయర్ మహేశ్వరరెడ్డి, కొటపాడు ఈశ్వర్‌రెడ్డి, కైప ప్రతాప్‌రెడ్డి, ముక్కమల్ల పుల్లారెడ్డి, సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. జలకళ పథకం ద్వారా తాను రైతుల కళ్లలో ఆనందం చూస్తున్నానని చెప్పారు. నియోజకవర్గంలోని కొలిమిగుండ్ల మండలంలోని తొళ్లమడుగు, ఉమ్మాయిపల్లె గ్రామాలకు చెందిన జలకళ పథకం లబ్ధిదారులు సోమవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోనే అత్యధికంగా నియోజకవర్గంలో 800 బోర్లు వేశారన్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించండి

బనగానపల్లెరూరల్: రైతులు చిరుధాన్యల పంటల సాగు పై దృష్టి సారించాలని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కోరారు. సోమవారం స్థానిక జీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో యాగంటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), సత్య మిల్లెట్ అండ్ ఫుడ్ ప్రొడక్ట్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో చిరుధాన్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతి రోజు చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. డాక్టర్ ఖాదర్‌వలి చిరుధాన్యాల ఆవశ్యకతపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ కొర్రలు, అండు కొర్రలు, సామలు, వరిగలు, ఊదలు, అరికలు ఉపయోగాలను వివరించారు. వాటిని ఆహారంగా తీసుకుంటే ఎలాంటి రుగ్మతలు దరిచేరవన్నారు. అనంతరం డాక్టర్ ఖాదర్‌వలిని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో సత్య మిల్లెట్ అండ్ ఫుడ్ ఫౌండర్ కేవీ రామసుబ్బారెడ్డి, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ధనలక్ష్మి, ఏఓ సురేష్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ సుధాకర్, లక్ష్మీప్రియ, బాలరాజు, ఆదినారాయణ, రవిగౌడ్, కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, పారిశ్రామికవేత్తలు యాగంటిరెడ్డి, గాలి మద్దిలేటిరెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.



డాక్టర్ ఖాదర్‌వలిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి